సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!



★

రచన:

**శ్రీ బుద్ధిరాజు నరసింహారావు**

(గతసంచిక తరువాయి)

'అరెరే...అదేమిటండీ...అప్పుడే ఒట్టే వేసేస్తున్నారు...'

భావావేశంలో తాననేసిన మాట గుర్తుకిరాగానే నాలిక కరచుకుంది. వదిలిన బాణం, పలికిన వాక్యం తిరిగి రాదు కదా ?

సిగ్గువల్ల మాట పెగల్నే లేదు జయసుధకి.

'సరే,..నేను ముందే చెప్పాను జయసుధగారూ.., మనసులో మాట దాచుకునేరకం కాదు నేను. సూటిగా ఏదైనా చెప్పేయడం నాకు చిన్నతనంనుండి అలవాటయినది. మిమ్మల్ని చూసిన మొదటిక్షణంలోనే ఆకర్షింపబడ్డాను. ఎందుకో మీరు నాకు చాలా నచ్చారు. నాకు తెలియకుండానే నామనసులో చోటు చేసుకున్నారు. మీతో ప్రతిరోజూ పరిచయం చేసుకుందామనుకునే వాడిని. కానీ ఆ అవకాశమే చిక్కలేదు. తర్వాత నా ఫ్రెండ్ గోపాల్ మీ ప్రేమవ్యవహారంగురించి చెప్తే బాధపడ్డాను. ప్రేమ్‌గురించి నాకంతా తెలుసు. అతని కేరెక్టర్ ఎటువంటిదో నాకు బాగా తెలుసు. మిమ్మల్ని నా స్వంతం చేసుకోలేకపోయినా ఒక మానవధర్మంగా మీకు నచ్చచెబుదామని వస్తే...' చక్రవర్తి కొద్దిక్షణాలు మౌనంగా గడిపి తిరిగి, 'మీరు అవమానించినతర్వాత నాకు చాలా బాధ అనిపించింది. ఎటువంటి దురాలోచనా మనసులో లేకుండా, మీకు మంచి చెబుదామనుకున్నాను. కాని, నామాటకీ, నా వ్యక్తిత్వానికీ, అసలు విలువలేకపోయిందని కుమిలిపోయాను' అన్నాడు.

జయసుధకి నిజంగా మతిపోయినట్లయింది. నిజంగా చక్రవర్తిని అంత బాధకి గురిచేసేనా అని విచారించింది.

'అప్పటినుండి నాకు ఎక్కడా తోచేదికాదు. అందుకే ప్రతిరోజూ సాయంత్రం యిక్కడికివచ్చి గంటలు తరబడి ఏకాంతంగా గడుపుతున్నాను. ఇలా అయినా మనసు కొస్త కుదుటపడుతుందేమో నని. నేడు నేను లేచి బయల్దేరే ముందర 'మీ కంఠస్వరం విని వచ్చాను. అంతే.'

మాటలమధ్యలో వారెప్పుడు మెయిన్ రోడ్డుమీదకి వచ్చారో తెలియలేదు.

'ముందు మిమ్మల్ని డ్రాప్‌చేసి, ప్రేమ్ యింటికి పెళ్ళి స్కూటర్ పడేస్తాను' అన్నాడు చక్రవర్తి.

జయసుధ మౌనంగానే అంగీకారం తెలిపింది.

* * *

రాత్రి పది దాటింది.

ఇంటిముందు స్కూటర్ ఆగిన శబ్దమవగానే ప్రభ వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా జయసుధ !

'ఇంతసేపు ఎక్కడుండిపోయావో అని అమ్మా, నాన్నగారూ గాబరా పడుతున్నారక్కా ;

'అసలు పార్టీ లేటుగా ప్రారంభమైంది ప్రభా' ఆమె లోపలికివచ్చి తలుపువేస్తూ అన్నది.

'భోంచేస్తావా అక్కా!'

'అబ్బే, పార్టీలో కడుపునిండా తినివచ్చి మళ్లా భోజనమేవిటి ? అమ్మా నాన్నగారు పడుకున్నారా ?' జయసుధ ప్రభని అడిగింది.

వెంటనే గదిలోంచి, 'ఎవరూ...అమ్మాయి జయా... రామ్మా' అని చలపతిరావు గొంతు వినిపించింది.

త్వరత్వరగా జయసుధ తండ్రిగారి గదిలోకి వెళ్ళింది.

తల్లి క్రింద కూర్చుని ఏదో యింటిలెఖ్ఖలు వ్రాస్తున్నది.

తండ్రి చలపతిరావు మంచంపై తలగడాలని ఆనుకుని కూర్చున్నాడు.

'అబ్బ, ఈరోజు నిజంగా ఎలా గడిచిందో చెప్పలేను నాన్నా. ఈ ఒక్కరోజు ప్రొద్దున్ననించి మీముఖం చూడకపోతే ఏదో వెలితిగా వుంది.' అంది జయసుధ తండ్రి పక్కనే కూర్చుంటూ.

'ఏం చేస్తామమ్మా. ఆఫీసుపని ఈమధ్య చాలా ఎక్కువగా వుంది, అంతే.'

'అమ్మాయి జయా, అయితే పార్టీ ఎలావుందే ?' తల్లి ప్రశ్న.

కాస్త తటపటాయిస్తూ, 'పార్టీ గ్రాండ్‌గా చేసారమ్మా!' అంది.

'సరేలే...యింక రెస్టు తీసుకో,'

తల్లి పుస్తకం మడిచి లేచింది.'

* * *

నాలుగురోజులు దాటాయి.

ప్రేమ్‌కుమార్ తనకి జరిగిన అవమానానికి బదులుగా జయసుధా చక్రవర్తి జీవితాలనే నాశనం చేస్తానని ప్రతిజ్ఞ చేసుకున్నాడు.

జయసుధ తనకి వ్రాసిన లేఖలన్నీ తీసి తనదగ్గర వుంచుకున్నాడు.

ఆ లేఖలనిబట్టి తను జయసుధని జీవితాంతం తలెత్తి తిరగలేనట్లు చెయ్యగలడు.

తనవద్ద యింకా ప్రమాణంకూడా వుంది. తనూ జయసుధా కలిసి 'అలంకార్' స్టూడియోలో తీయించుకున్న

Bajaj D.R EGYPTIAN

BAJAJ KNITTERS, INDIA.

మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాస్టర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్‌లాక్ * ఓపిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* స్కై రాజ్ * రాకెట్

ఇవికాక ☆ జెట్టీలు ☆ లండన్ ☆ స్మిట్రా ☆ బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

**BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 6012.**

ఫోటో ! వాటి కాపీలు తీయించి ఆ వీధిలో పంచిపెడితే చాలు !

జయసుధ తండ్రికిష్వన్న పరువు కాస్తా పోతుంది. పది మందిలో చెప్పుదెబ్బ కొట్టినట్లుంటుంది. చివరకు తన దగ్గరకేవచ్చి కాళ్ళా వేళ్ళాపడి క్షమాభిక్ష అడుగుతారు. తను క్షమించడు. జీవితాంతం క్షమించడు.

ఇలా రకరకాలుగా ఎన్నో నిశ్చయాలకి వచ్చాడు ప్రేమ్ కుమార్ !

కాని, అతని నిశ్చయాలన్నీ గాలిమేడలవలె కూలి పోయాయి.

* * *

మూడురోజులక్రితం అకస్మాత్తుగా కోవెలకివెళ్ళిన ప్రేమ్‌కుమార్ చెల్లెలు- సుభద్ర తిరిగి రాలేదు. రాత్రి తొమ్మిదిగంటలైనా తిరిగి రాకపోతే యిల్లంతా హడావిడిగా మారింది.

అప్పుడే ప్రేమ్‌కుమార్ మిత్రులతో కాలక్షేపం చేసుకుని యింటికి వచ్చాడు.

తల్లీ తండ్రీ ఉదాసీనంగా కూర్చునుండడంచూసి, 'ఏమైందమ్మా...ఎందుకూ విచారంగా వున్నారు' అని అడిగాడు.

'బాబూ, ఎప్పుడనగా కోవెలకి వెళ్ళిన సుభద్ర యింకా తిరిగిరాలేదు' అంది కంట తడిపెట్టుకుంటూ తల్లి.

'అయితే, గాబరాపడటం దేనికమ్మా. ఎవరైనా స్నేహితురాలింటికి వెళ్ళివుండవచ్చు. వచ్చేస్తుందిలే!' అని ప్రేమ్ కుమార్ తేలిగ్గా అన్నాడు.

'కాదురా బాబూ ! నేను దాని స్నేహితురాళ్ళందరినీ కలిసేవచ్చాను. ఎవరింటికీ వెళ్ళలేదుట.'

'అయితే కోవెలలో పూజారిని అడిగితే ఏమైనా తెలుస్తుందేమో ?'

'ఆచార్లుగార్నికూడా అడిగానురా. ఆయనకి సుభద్రని బాగా తెలుసు. అసలీరోజు సుభద్ర కోవెలకే రాలేదన్నారు' తండ్రి రామయ్య భారంగా ఊపిరిపీలుస్తూ అన్నాడు.

ప్రేమ్‌కుమార్‌కి సుభద్ర ఎక్కడికి వెళ్ళిందో ఎంత ఆలోచించినా అంతు పట్టలేదు.

సుభద్ర ఆ రెండోరోజుకూడా తిరిగి రాకపోతే పోలీస్ రిపోర్టు యిచ్చివచ్చాడు ప్రేమ్‌కుమార్.

ఇంతకీ సుభద్ర ఏమైనట్లు ? ఎక్కడికి వెళ్ళివుంటుంది ?

తనతోనైనా, అమ్మతోనైనా ఏమీ చెప్పకుండా ఎప్పుడూ వెళ్ళదే ?

ప్రేమ్‌కుమార్ పిచ్చివాడిలా స్కూటర్‌మీద రోడ్డులూ, పొలాలూ గాలించాడు.

కాని, సుభద్రజాడ తెలియలేదు.

మూడోరోజుని పోస్టులో ఒక కవరు వచ్చింది.

ఆ కవరుమీద చెల్లెలు సుభద్ర అక్షరాలు కనబడగానే ప్రేమ్‌కుమార్ ఉలిక్కిపడ్డాడు.

ఆత్రంగా ఉత్తరం విప్పాడు.

అన్నయ్యా !—

ఇలా ఎవరికీ చెప్పకుండా, మీకు దూరంగా వెళ్ళిపోతున్నా నన్నయ్యా !

అమ్మా, నాన్నా, నువ్వూ ఎంతగా బాధపడివుంటారో నే నూహించుకోగలను, కాని, ఏం చేసేదన్నయ్యా ?

నన్ను అంతగా ప్రేమించి, ముద్దుగా ఏలోటూ రానీకుండా పెంచి పెద్దచేసిన అమ్మా, నాన్నా అవమానం పాలైతే నేను భరించలేనన్నయ్యా, నాలాంటి తప్పుచేసిన ... ప్రేమలో సర్వస్వం అర్పించుకుని, దగాపడి, మోస పోయిన ప్రతీ ఆడదానికీ చివరిగమ్యం యిదే అనుకుంటాను.

నే నొకరిని ప్రేమించా నన్నయ్య.

అతను నాకు ఎన్నెన్నో తీయనికలలు చూపించాడు. నేను ఈ లోకమంతటికీ అందమైన అమ్మాయినని అందలం ఎక్కించాడు. నేను అతని తీయనిమాటలకీ, చిలిపి చేష్టలకూ లొంగిపోయి, సర్వస్వం అర్పించుకున్నాను.

పెళ్ళి కాకుండానే నేను చేసిన పెద్దనేరం అదే అన్నయ్యా. మా అమ్మా నాన్నతో వచ్చి మాట్లాడు అని నేనెన్నోసార్లు చెప్పాను.

కాని, అతను 'రేపు రేపు' అని గడువులు పెట్టేవాడు. చలాకీమాటలతో నన్ను లొంగదీసుకునేవాడు.

నెలలు గడుస్తున్నకొలది నాలో ఆందోళన ఎక్కువైంది. ఏదో తెలియని భయం భూతంలా నన్ను వెంటాడ సాగింది. నేను చేసినతప్పు సుడిగుండంలా ఎదురుగా నిలిచింది.

మరి భరించలేక అతనికి నిజం చెప్పేసాను.

అతను విని పెద్దగా, భయంకరంగా అట్టహాసం చేసాడు. నేను నిర్ఘాంతపోయాను. ఆశ్చర్యంతో అర్థం కానట్లు అతనివైపు చూసాను.

'ఏమిటీ ? నీవు తల్లి కాబోతున్నావా ? వెరీగుడ్. అదే కదా నేకోరేది !' అని మళ్ళీ పెద్ద నవ్వు నవ్వాడు.

నేను అతనిపాదాలపై వంగి, నాజీవితంలో తుఫాను చెలరేగకుండా కాపాడేభారం తనదేనని వేడుకున్నాను.

అతను నన్ను కాలుతో దూరంగా తోసిపారేసాడు.

అప్పుడు నిజం తెలిసిందన్నయ్యా !

అతని చెల్లెల్ని నీవు వలలో వేసుకుని, ఆమె తనువు దోచుకుని చల్లగా జారుకున్నావట. ఆ అమ్మాయి వచ్చి ప్రాధేయపడినా అసలు ఆమె ఎవరో నీకు తెలియదని గెంటేసావుట.

గతిలేక ఆ అమ్మాయి నూతిలోపడి ప్రాణాలు కోల్పోయిందట. ఆ పగ నాతో తీర్చుకున్నాడట అతను.

నేను క్షమించమని ఎంత ప్రార్థించినా అతను వినలేదు.

పిచ్చిగా, 'నాచెల్లెలు వెళ్ళిన స్థానానికే నీవూ వెళ్ళాలి. అప్పుడే నా చిన్నారి చెల్లెలి ఆత్మకూ, నాకూ శాంతి లభిస్తుంది' అని గెంటి పారేసాడు.

మరోమార్గం లేదన్నయ్యా !

నీవు చేసిన తప్పులకు నాజీవితం బలి అయింది. ఐనా నీమీద నా కెటువంటి కోపమూ లేదు.

మరి నేను తిరిగి రాలేనన్నయ్యా.

అమ్మని నాన్నని నన్ను క్షమించమని చెప్పు. నాకోసమే బాధ...వాళ్ళని బాధపెడుతున్నాను కదా అని...

చివరిగా ?...

నిప్పటికైనా నువ్వు నీ ఆటలు కట్టిపెట్టమని నా విన్నపం...

అన్నయ్యా, ప్రేమ అనేది ఉన్నతమైనది. పవిత్రమైనది. దాన్ని నీవు మరెన్నడూ కలుషితం చెయ్యబోకు.

అమాయకులైన ఆడవాళ్ళ జీవితాలని అన్యాయం చెయ్యకు. మంటలపాలు చెయ్యకు.

నా ఈ చివరికోరిక ఎన్నడూ కాదనవని నాకు తెలుసు. ఎప్పుడూ అమ్మకీ నాన్నకీ తోడుగా వుంటావు కదూ ?

నీకీ ఉత్తరం అందే సమయానికి నేను బ్రతికుండనన్నయ్యా...వెతికి లాభం లేదు.

చివరిసారిగా మీ అందరికీ నా...నా...నమస్కారాలు,

శెలవు !

చెల్లి,
'సుభద్ర.'

ప్రేమ్‌కుమార్ కన్నీటితో తడిసిన ఆ ఉత్తరం క్రింద పడింది.

'సుభద్రా...' అని భోరుమని ఏడ్చాడు.

అతని శరీరంలో రక్తం చల్లబడినట్లయింది. భూమి గుండ్రంగా తిరిగింది.

తను చేసిన తప్పులు తన కెదురుగావచ్చి నిలిచాయి.

పశ్చాత్తాపంతో, 'నన్ను క్షమించు సుభద్రా...నేను పాపాత్ముణ్ణి. మరెన్నడూ ఎవరికీ అన్యాయం చెయ్యను' అని కన్నీరు కార్చాడు ప్రేమ్‌కుమార్.



***

''కొండవీటి నాగులు''
చిత్రంలో
కృష్ణంరాజు

***

Phone : 22465

మా తయారింపులు :—

• డాక్టర్, • ఏర్‌కూల్
• చోల్డ్‌విన్ • లైఫ్
• టిప్‌టాప్ • ఐలెట్

Regd No. 306 682

TURKEY KNITTERS
Lakshiminagar Tirupur - 638 602.

అంతలో తల్లి అక్కడికి రావడంతో వెంటనే ఉత్తరం తీసి డ్రాయర్‌లో పడేసాడు.

* * *

'హలో, చక్రవర్తిగారా ?'

లైబ్రరీ రూంలో పుస్తకాలు చూసుకుంటున్న చక్రవర్తి ఉలిక్కిపడ్డాడు.

వెనక్కితిరిగి, 'ఓ మీరా ?' అన్నాడు.

'ఏం, అనుమానమా ?' జయసుధ నవ్వుతూ అడిగింది.

'అనుమానం కాదులెండి. ఆశ్చర్యంగా వుంది.'

'ఆశ్చర్యమా ?'

'అం ? నాకు కాకపోయినా, మిగతా విద్యార్థులు ఆశ్చర్యంతో గుడ్లప్పగించి చూస్తారు !' చక్రవర్తి గోర్కీ పుస్తకాన్ని తిరగేస్తూ ఉన్నాడు.

'ఎందుకని ?' ఆశ్చర్యంగా అడిగింది జయసుధ.

'ఎందుకానా ? ఆరోజు లెంపకాయ తిన్న...'

'అదుగో, మళ్ళీ అలా అంటేనే నాకు కోపంవస్తుంది. మీ ఎత్తిపొడుపుమాటలూ, వ్యంగ్యబాణాలూ నేను భరించలేను.'

'అం హం...మిమ్మల్ని బాధపెట్టాలనికాదు నా ఉద్దేశం. ఓన్లీ ఫార్ ఫన్. చూడండి....ఎవడో గొప్పవాడన్నాడు కదా, జీవితంలో ఎప్పుడూ నవ్వుతూ ఎదుటివాళ్ళని నవ్విస్తూ వుండాలని. అందుకే. ఆది సరేగాని, మీ యింట్లో అంతా కులాసాయేనా ?'

'అం....బాగానే వున్నారు. అన్నట్లు నాకెందుకో అనుమానంగా వుంది !'

చక్రవర్తి ఆశ్చర్యంగా ఆమెవైపు చూసాడు. 'అనుమానం దేనికి ?'

'పేమ్‌కుమార్ అసలు కాలేజీకే రావడంలేదు. ఎందుకనో తెలియడంలేదు.'

'ఎందుకేమిటండీ...ఆరోజు నాదెబ్బలు పాపం జోరుగా తగిలుంటాయి. వాళ్ళమ్మచేతో, బొమ్మచేతో కాపడం పెట్టించుకుంటూ వుండవచ్చు.

'పొండి...మీరు మరీను...ఎప్పుడూ జోకులే. నేను సీరియస్‌గా అంటున్నాను.'

'నేనూ సీరియస్‌గానే అంటున్నాను. చక్రవర్తి ముక్తసరిగా అన్నాడు.

'అదికాదు చక్రవర్తి...నాకెందుకో భయంగా వుంది. అతనివద్ద నేను బుద్ధిలేక వ్రాసిన ఉత్తరాలున్నాయి. అది కాకుండా మరో డేంజెరసీ వస్తువుకూడా వుందతనివద్ద.

'అంటే?'

'నేనూ అతనూకలిసి అలంకార్‌లో ఒక ఫోటోకూడా తీయించుకున్నాము.'

'ఓహ్...ఎంత పొరపాటు !'

'అందుకే నాభయం...అతను అవి మావాళ్ళకు చూపెడితే...'

'వెంటనే మీవాళ్ళు పెళ్ళి జరిపిస్తారు.'

'మిస్టర్ చక్రవర్తి...బీ సీరియస్...' అంది కోపంగా జయసుధ.

చక్రవర్తి మౌనం దాల్చాడు.

'ఆ లేఖలూ, ఫోటో ఫలితంగా మా నాన్న పరువు ప్రతిష్టలు బజార్లో పడతాయి. మీకు తెలియదు చక్రవర్తి... నాన్నగార్కి నేనంటే ప్రాణం...నేను చేసిన ఈ తప్పుకి ఆయన కుమిలిపోతారు ...ప్లీజ్....ఎలాగైనా హెల్ప్ చెయ్యండి ...మీఋణం జీవితాంతం మరచిపోను....' జయసుధ దీనంగా ప్రాధేయపడింది.

చక్రవర్తి రెండుపుస్తకాలు చేతిలోకి తీసుకుని, 'మీరు గాబరా పడకండి ... నే చేయగలిగేది తప్పక చేస్తాను. మరి శెలవా !'

కొద్దిసేపటికి యిద్దరూ లైబ్రరీనుండి బయటపడ్డారు.

(సశేషం.)